'ముషీరాబాద్‌లో బీఆర్‌ఎస్ బలమైన శక్తిగా ఎదిగింది'

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో బీఆర్‌ఎస్ బలమైన శక్తిగా ఎదిగిందని బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని అభినందిస్తూ వారు సన్మానించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ సారథ్యంలో ముషీరాబాద్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ బీఆర్‌ఎస్ బలోపేతానికి అంకిత భావంతో కృషి చేస్తున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్, అడిక్మెట్ డివిజన్ల బీఆర్‌ఎస్ నాయకులు దీన్దయాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, పూసగోరఖ్‌నాథ్, జావిద్‌ఖాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మహేంద్ర కుమార్‌రెడ్డి. డా.హిప్నో పద్మాకమలాకర్

చిక్కడపల్లి: చదువుతో భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చునని లయన్స్ క్లబ్ 320ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. యూత్ స్కిల్ డేను పురస్కరించికుని లయన్స్ క్లబ్ 320ఏ ఆధ్వర్యంలో మంగళవారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హోల్ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక సాయం ఆయన అందజేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ, పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెంటల్ వెల్‌నెస్ సమన్వయకర్త డా. హిప్నో పద్మాకమలాకర్, విశ్రాంత డీఎస్పీ రామచంద్రన్, ప్రముఖులు మోహన్ దాస్, విద్యాసాగర్, గోపాలకృష్ణ, కృష్ణవేణి, లక్ష్మి,జయశ్రీ, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటేందుకు కృషి



మొక్క నాటి నీరు పోస్తున్న గోల్నాక కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట: డివిజన్‌లో ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు తన వంతు చొరవ తీసుకుంటానని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా మంగళవారం ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంసరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలువురు జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలి



బీసీ సమావేశానికి వెళ్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నాయకులు

అంబర్‌పేట: బీసీ ప్రజా ప్రతినిధుల ఫోరం (బీసీపీఎఫ్) నిర్వహించిన సమావేశానికి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ తమ అనుచరులతో కలిసి తరలివెళ్లారు. మంగళవారం ఇందిరాపార్క్ వద్ద మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తరలివెళ్లిన వారిలో నాయకులు సురేష్‌గౌడ్, మహేశ్ ముదిరాజ్, చందు, రంగు ఉదయ్‌గౌడ్, కిరణ్‌గౌడ్, దినేష్, సంతోష్‌చారి తదితరులు ఉన్నారు.

పద్మశాలి యువజన సంఘాన్ని బలోపేతం చేయండి

కాచిగూడ: అఖిల భారత పద్మశాలి యువజన సంఘాన్ని దేశవ్యాప్తంగా మరింత బలోపేతం చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ సంగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సంఘానికి అనుబంధంగా ఉన్న 18 రాష్ట్రాలలోని పద్మశాలి యువతలో రాజకీయ చైతన్యం కల్పించాలన్నారు. యువజన సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ సంగ ఈ సందర్భంగా జాతీయ స్థాయి యువజన విభాగం కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కట్ట అశోక్, ప్రధానకార్యదర్శిగా మహేష్ జిందా, కార్యదర్శులుగా వనం విద్య, కందగట్ల చేతన, బర్రెంకల ప్రియ, గాడిపల్లి శ్రీలేఖ, సురేష్ గోపిలను నియమించారు.



అంబర్‌పేట మహంకాళి వద్ద బోనాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి



చెంచుబస్తీలో శాంతి భద్రతలపై అవగాహన కల్పిస్తున్న ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య

బోనాలకు సమన్వయంతో పనిచేయాలి

- పార్కింగ్, వీఐపీ రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపుపై కసరత్తు చేయండి
- పోలీసు విభాగంతో పాటు ఇతర శాఖల అధికారులకు సూచన
- ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట: సమన్వయంతో బోనాలు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. మంగళవారం అంబర్‌పేట ప్రధాన రోడ్డులో ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయం పరిసరాల్లో ఉత్సవాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్, వీఐపీ రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలపై ముందస్తూ కసరత్తు చేయాలని ఆదేశించారు. ఆలయ కమిటీ వారు సైతం తమకు సహకారించాలిని ఆయన తెలిపారు. ఇతర పోలీసు విభాగంతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేయాలన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు డీపీ రెడ్డి, రంగంపల్లి రాజు, ఇతర ట్రాఫిక్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

యువత హద్దు మీరితే కఠిన చర్యలు: ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య

- శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య అన్నారు. రాబోయే బోనాల వేడుకల్లో యువత హద్దులు దాటితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆయన తెలిపారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ చెంచుబస్తీలో అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... చెంచుబస్తీ యువతపై గతంలో అనేక ఫిర్యాదులు వచ్చేవని, అవి తగ్గుముఖం పట్టినట్లు చెప్పారు. బస్తీవాసులు, యువత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని సూచించారు. బోనాల వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఘర్షణలకు తావు ఇవ్వొద్దని సూచించారు. బోనాల బందోబస్తు కఠినంగా చేపడుతున్నట్లు, అంతా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహేందర్, బస్తీ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

కాంగ్రెస్ నాయకురాలు గుర్రం చంద్రకళ



ముషీరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే బోనాల ఉత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు గుర్రం చంద్రకళ తెలిపారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 200పైగా దేవాలయాలకు సుమారు ఒక కోటి 7 లక్షల రూపాయల నిధులను ఆలయ కమిటీ నిర్వాహకులకు రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అందజేసినట్లు తెలిపారు. ఆలయాలకు విద్యుత్ అలంకరణ, షాబాద్ బండలతో ఫ్లోరింగ్, మరమ్మతులు, దేవాలయాలను రంగులతో అందంగా తీర్చిదిద్దేందుకు ఈ నిధులను వెచ్చించాలని కోరారు. ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని, పోలీసులకు పూర్తిగా సహకరించాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు.

వైభవంగా దర్బార్ మైసమ్మ బోనాలు

బోనాలు సమర్పించిన ఈపీఎఫ్ ఉద్యోగులు, సిబ్బంది

కాచిగూడ: బర్కత్‌పురలోని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయంలోని దర్బార్ మైసమ్మ ఆలయంలో మంగళవారం బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో బర్కత్‌పుర ఈపీఎఫ్ కమిషనర్ డాక్టర్ శివకుమార్, తేజ్‌ప్రతాప్ సింగ్, ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు, డి.గోపాల్‌గౌడ్, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పూజలో పీఎఫ్ కమిషనర్లు తేజ్ ప్రతాప్‌సింగ్, శివకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు

శాకాంబరిగా రేణుకాఎల్లమ్మ



అంబర్‌పేట: రేణుకాఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారి శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమించ్చారు. మంగళవారం అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులోని రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలతో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి కాలేరు పద్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా ఆమెను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

భారతీయ సంస్కృతిలో శాస్త్రీయ కళలకు ప్రాధాన్యం

ప్రముఖ కథక్ నృత్య గురువు పండిట్ డా. అంజిబాబు

చిక్కడపల్లి: భారతీయ సంస్కృతిలో శాస్త్రీయ నృత్యం, కళలకు ఎంతో ప్రాధాన్యం ఉందని ప్రముఖ కథక్ నృత్య గురువు పండిట్ డాక్టర్ అంజిబాబు అన్నారు. కళా మండపం (బెంగళూరు) ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో భారతీయ శాస్త్రీయ నృత్యోత్సవం-2025ని నిర్వహించారు. దీప, భూమిరావు, దీక్షలు భరత నాట్యం, రమ్య ఒడిస్సీ, కవిత, మాధవి, కథక్, ధృతి, సూర్యప్రకాష్ వివిధ నృత్య క్రియల్లో నృత్యాంశాలను ప్రేక్షక రంజకంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో పండిట్ అంజిబాబు ముఖ్యఅతిథిగా కళాకారులను అభినందించి జ్ఞాపికలను ప్రదానం చేసి మాట్లాడారు. బెంగళూరులో కళా మండపాన్ని స్థాపించి భారతీయ నృత్య ప్రక్రియలను దుబాయ్ వంటి విదేశాల్లో సైతం ప్రాచుర్యం కల్పించడం అభినందనీయమని అన్నారు. నిర్వహణ సంస్థ స్థాపకురాలు బిను తాగిన్, కస్తూరి కళాక్షేత్ర వ్యవస్థాపకురాలు ప్రియాంక మిత్రా, వ్యాఖ్యాత డైమండ్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య గురువులకు జీవనోపాధి కల్పించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నృత్య గురువులకు జీవనోపాధిని కల్పించాలని కోవిద కల్చరల్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ పి. అనూహ్యరెడ్డి అన్నారు. నృత్య గురువుల నుంచి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహా కమిటీ సభ్యులుగా చేర్చాలని ఆమె కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నృత్య గురువుల సమస్యలపై సమాలోచన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనూహ్యరెడ్డి మాట్లాడుతూ... నృత్య గురువులు అందరికీ రవీంద్ర భారతిలో అవకాశం కల్పించాలన్నారు. నృత్య గురువులకు భారతదేశంలో విశిష్టమైన స్థానం ఉందని అటువంటి గురువులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందకపోవడం బాధాకరమని అన్నారు. శాస్త్రీయ సంగీత నృత్య అకాడమీని ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణలో సాంస్కృతిక సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. అనంతరం అనూహ్యరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, గోవింద ఆర్ట్ కల్చరల్ అకాడమీ(జీఏసీఏ) సలహాదారులు పీఎస్ మూర్తి, శ్రీరామ్‌దట్టి, సీనియర్ జర్నలిస్ట్ సుమన్, సురేష్‌గౌడ్, అనుదీప్తి, హిందుమతి, రాధిక శ్రీనివాసులు పాల్గొన్నారు.



నృత్య గురువు అనూహ్యరెడ్డిని సత్కరిస్తున్న టీపీఎస్‌కే, జీఏసీఏ ప్రతినిధులు

దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశ్రాంత ఐఏఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం



నల్లకుంట: స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఉమ్మడి ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ. సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రి రీసెర్చ్‌సెంటర్ (డీడీహెచ్‌ఆర్‌సీ) ఆడిటోరియంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్వీ సుబ్రహ్మణ్యం 'దుర్గాబాయి దేశ్‌ముఖ్ మోడల్ ఆఫ్ డెవలప్‌మెంట్'అంశంపై 38వ స్మారకోపన్యాసం చేశారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం, నివాసం లాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. అలాగే మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఆమె చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.

- మహిళలు విద్యావంతులైతే సమాజం దేశ ప్రజలంతా మొత్తం విద్యావంతులవుతారని ఆమె పరితపించేవారని పేర్కొన్నారు. యువతను చైతన్య పరుస్తూ వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపడం, సేవా భావాన్ని కల్పిస్తూ.. సత్యాన్వేషణ చేస్తూ.. నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఆమె నిరంతరం పాటు పాడేవారని తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ అధ్యక్షురాలు ఉషాకంద సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్ ఉపాధ్యక్షురాలు లక్ష్మీసుందరి, కార్యదర్శి లలితా కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


'డబుల్' ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయండి

చిక్కడపల్లి: స్వామి వివేకానందనగర్ బస్తీ 19 దళిత కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని మంగళవారం రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీఓ) పి.సాయిరాంను కోరారు. బాధితులతో కలసి ఆమె ఆర్డీఓ కార్యాలయంలో మాట్లాడారు. ఏడాదిన్నరగా పేదలకు పునరావాసం కల్పించడంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందని ఆమె ఆర్డీఓను ప్రశ్నించారు? దీనికి సంబంధించిన వివరాలను ఎమ్మార్వో, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల్లో అందజేసినా జాప్యం జరుగుతోందని అన్నారు. ఈ విషయంపై కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, జిల్లా కలెక్టర్ల ఇళ్ల మంజూరు చేయాలని సూచించారని ఆమె తెలిపారు. పేదల పట్ల ఇళ్ల కేటాయింపులో ఆలస్యం చేయకుండా వెంటనే కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలని ఆమె కోరారు. త్వరలోనే బాధిత కుటుంబాలకు కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తామని ఆర్డీఓ సాయిరాం హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, బస్తీవాసులు ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బస్తీవాసులతో వెళ్లి ఆర్డీఓ సాయిరాంతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని.. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. ఎమ్మెల్యే సహకారం, కేర్ ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం నల్లకుంట తిలక్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. బస్తీలో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బస్తీలలో వైద్య శిబారాల ఏర్పాటుకు స్వచ్ఛందసేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు పలువురు పలు ఆరోగ్య సమస్యలపై చికిత్సలు పొందారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నరేష్, ఆర్థోపెడిక్ స్పెషలిస్టు డాక్టర్ రామ్‌బాబు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రసాద్, సాయిని మూర్తి, గోనే ప్రదీప్ రావు, విజయేంద్రసాగర్, శరత్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

27న మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్

ముషీరాబాద్: హైదరాబాద్‌లో జూలై 27న ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) రాష్ట్రస్థాయి జనరల్ కౌన్సిల్ విద్యానగర్‌లోని మార్క్స్ భవన్ జరుగుతున్నట్లు పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ కౌన్సిల్‌కి ప్రధాన వక్తగా కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ హాజరవుతారన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో డ్రగ్స్, గంజాయి సేవిస్తూ తమ జీవితాలను కోల్పోతున్నారని ప్రభుత్వం పట్టీపట్టనట్లుగా ఉందన్నారు. కల్తీ కల్లు యథేచ్ఛగా అమ్ముతున్నా ప్రభుత్వం అబ్కారీ అధికార యంత్రాంగం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. బెల్ట్ షాపులు, కల్తీ కల్లు దుకాణాలు మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.కృష్ణ, కొల్లూర్ భీమేష్, బాలు, ప్రకాష్, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

'ట్రస్ట్‌ను ఎండోమెండ్ పరిధి నుంచి తొలగించాలి'

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌ను ఎండోమెంట్ పరిధి నుంచి తొలగించి తిరిగి మున్నూరుకాపులకు అప్పగించాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండ దేవయ్యపటేల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. అనంతరం కాచిగూడలోని కార్యాలయంలో మాట్లాడుతూ... మున్నూరుకాపుల్లో ఉన్న అనైక్యత వల్ల మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌కు దేవాదాయ శాఖ ఈఓగా అంజనారెడ్డి బాధ్యతలు తీసుకున్నారని అన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీని కలిసి మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌ను ఎండోమెంట్‌పరిధి నుంచి బయటకు తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మున్నూరుకాపులు అందరూ సంఘటితంగా ఉండి మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌ను తిరిగి మనం సాధించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

టక్కీ జైల్ నుంచి బాలిక అదృశ్యం

కాచిగూడ: నింబోలిఅడ్డలోని టక్కీ జైలు (బాలిక సదన్) నుంచి ఓ బాలిక అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉస్మాన్‌గంజ్ ప్రాంతానికి చెందిన అఫ్జల్ కూతురు సుమయ (14) మంగళవారం టక్కీ జైలు నుంచి ఎవరికి చెప్పకుండా గేటు దూకి పారిపోయింది. దీంతో టక్కీ జైలు సూపర్‌వైజర్ మేకల కళ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని మహిళ (50) మలక్‌పేట రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక



బోనాల వేడుకల్లో పాల్గొన్న ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీల, రాసూరి జ్ఞానేశ్వర్

కాచిగూడ: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీల అన్నారు. మంగళవారం నారాయణగూడలోని ఐపీఎంలో రాసూరి జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు, ఉద్యోగులు మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు, ఉద్యోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయశాంతి, డాక్టర్ ఉమా, అన్నపూర్ణ, వి.సుశీల్ కుమార్, ప్రదీప్, సంతోష్, నరేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘటానికి స్వాగతం



ముషీరాబాద్: ముషీరాబాద్ మహంకాళి దేవాలయ అమ్మవారి ఘటాన్ని మంగళవారం ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి తదితరులు అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భరత్‌నగర్ శివాలయం చౌరస్తా తదితర ప్రాంతాలలో ఊరేగించారు. భక్తులు అమ్మవారి ఘటానికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం.. చండీ, కుబేర పాశుపత యాగం

కాచిగూడ: ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధిని ఆకాంక్షిస్తూ లోక కల్యాణార్థం కాచిగూడలోని తుల్జాభవన్‌లో పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగాన్ని రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. మంగళవారం గణపతి పూజ, కర్మణః పుణ్యాహవాచనం, మూల మంత్ర అనుష్టానం, ప్రధాన మంటప దేవత హోమం, నవగ్రహ హోమం, రుద్ర, చండీ, కుబేర పాశుపత హోమం, సహస్రనామ పుష్పార్చన, నీరాజన మంత్ర పుష్పం, బహుపరాకులు, చతుర్వేద ఆశీర్వచనం తదితర పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయ శర్మ, తుల్జాభవన్ ఈఓ ఎస్.అంజనారెడ్డి, ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ, డాక్టర్ రామలింగేశ్వర శర్మ, నాగదక్షిణామూర్తి, అమరేశ్వర్ శర్మ, అన్నావఝల ప్రసాద్‌శర్మ, నందనం హరికిషన్‌శర్మ, కొండూరు విశాలక్షి, వెంకటాద్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

యాగ పూజలో పాల్గొన్న టీబీఎస్ఎస్ ప్రతినిధులు

నల్లకుంట: కాచిగూడ తుల్జాభవన్‌లో రెండు రోజులుగా పంచ కుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగం జరుగుతోంది. టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు మంగళవారం యాగంలో పాల్గొన్నారు. అనంతరం దూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ యాగంలో టీబీఎస్ఎస్ ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి గూడా రాజేశ్వరరావు, కొండూరు నరసింహామూర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు.



తుల్జాభవన్‌లో జరుతున్న యాగంలో పాల్గొన్న దౌలతాబాద్ వాసుదేవ శర్మ, తదితరులు